www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 జులై 2025



చిరు వ్యాపారులపై విజిలెన్స్ దాడి అమానుషం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): గడిచిన 25 సంవత్సరాలుగా కుటుంబాలను పోషించుకోవడానికి తిరుమలకు కాలినడకన శ్రీవారి మెట్టు మార్గం ద్వారా వెళ్లే భక్తులకు చిరు తిండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై విజిలెన్స్ దాడులు అమానుషమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శ్రీవారి మెట్టు వ్యాపారస్తులతో కలసి మాట్లాడారు. గత 317 రోజులుగా టిటిడి పరిపాలన భవనం ఎదుట లైసెన్సులు కోసం న్యాయపరమైన కోర్కెలను తీర్చాలని నిరసన దీక్షలు చేస్తున్నారని, ఐదు ఆరు మంది యువకులు చేసిన అప్పులను తీర్చుకోవడానికి దీక్షా శిబిరం నుండి శ్రీవారి మెట్టు వద్ద వ్యాపారం చేసుకుంటుండగా యువకులను స్టేషన్‌కు తరలించి ఇష్టానుసారం కొట్టడంతో వారు నడవలేని స్థితికి చేరారన్నారు. టిటిడి అధికారులు, ధర్మకర్తల మండలి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు లైసెన్సులు మంజూరు చేసి ఆ వ్యాపారాలపైనే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఏడాదిలో కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు

- కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు
- ఆలయాల అభివృద్ధికి రూ.50 కోట్లు
- నియోజకవర్గం అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళిక
- అభివృద్ధికి, సంక్షేమానికి సైకిలే బెస్ట్
- కుప్పం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, శాంతిపురం, కుప్పం రూరల్

కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం శాంతిపురం మండలం తుమ్మిశిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బహిరంగ సభ కార్యక్రమానికి ముందు కుప్పం ప్రాంత అభివృద్ధికి సంబంధించి రూ.1207.90 కోట్ల విలువతో కూడిన పలుప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రత్యేక పథకాలకు చెందిన శిలాఫలకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఒక సంవత్సర కాలంలో పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు రూ.120.42 కోట్లు ఖర్చు చేశామన్నారు. 30.14 కి.మీ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులకు రూ.47.05 కోట్లు, 65 కి.మీల తారు రోడ్డు కు రూ.22 కోట్లు, 46 కి.మీల మేర సిమెంట్ రోడ్డులకు రూ.20.50 కోట్లు, 304 తాగునీటి సరఫరా పనులకు రూ.8.97 కోట్లు, 332 గోకులం షెడ్‌ల నిర్మాణానికి రూ.7.62 కోట్లు, 5639 వీధిదీపాల ఏర్పాటుకు రూ.3.70 కోట్లు, 64 ఓ హెచ్ ఎస్ ఆర్ మరమ్మతు పనులకు రూ.2.43 కోట్లు, 21 పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.1.64 కోట్లు, 56.30 కి.మీల బిటి రోడ్ల మరమ్మతులకు రూ.1.53 కోట్లు, ఆర్ అండ్‌బి నూతన భవనం నిర్మాణానికి రూ.1.40కోట్లు, 725 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.08కోట్లు, అన్నా క్యాంటీన్ల నిర్మాణానికి రూ.66లక్షలు, రూ.36 లక్షల ఖర్చుతో వెయ్యి గ్యాస్ కనెక్షన్‌లు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కి రూ.18 లక్షలు, ఎన్‌టిఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కుప్పం, సెంట్రల్ పార్క్, తదితర మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు రూ.1కోటి, రూ.5 కోట్లతో టాటా ఎండి డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటుకు ఖర్చు చేశామన్నారు. వీటితో పాటు రూ. 1167.61 కోట్లతో వివిధ పనులు మంజూరు చేశామని అవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే రూ.564 కోట్లతో 32,106 వ్యవసాయ ఫీడర్లకు సోలారైజేషన్, రూ. 10.21 కోట్లతో 331 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువల నిర్మాణం రూ.87.08 కోట్లతో 214 చెరువులు, చెక్ డాంల నిర్మాణం మరమ్మతులు, రూ.47.58 కోట్లతో 11 ప్రధాన దేవాలయాల అభివృద్ధి, రూ.38.45 కోట్లతో 120.03 కిలోమీటర్ల మేల ఆర్ అండ్ బి తార రోడ్ నిర్మాణం రూ. 37.95 కోట్లతో 17.42 కిలోమీటర్ల హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ లైనింగ్ పనులు, రూ. 33.67 కోట్లతో టిటిడి ద్వారా 141 చిన్న దేవాలయం అభివృద్ధి, రూ. 27.25 కోట్లతో 55.48 కి.మీ ల సిమెంట్ రోడ్డు, రూ.21.80 కోట్లతో 7489 ఎస్సీ ఎస్టీ గృహాలకు సోలోరైజేషన్, రూ. 20.79 కోట్లతో 904 గోకులం షెడ్లు, రూ. 19.77 కోట్లతో 13,180 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం రూ. 18.01 కోట్లతో ఏడు 33/11 కేవీ సబ్ స్టేషన్ లు, రూ. 10.36 కోట్లతో 35 ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, రూ. 8.22 కోట్లతో ఎన్టీఆర్ సుజల స్రవంతి, రూ. 6.87 కోట్లతో 14 హాస్టల్ మరమ్మతులు, రూ. 2.6 కోట్లతో నాలుగు అన్న క్యాంటీన్‌లు, రూ.2.60 కోట్లతో 13 గ్రామపంచాయతీ భావన నిర్మాణాలు, రూ.1.57 కోట్లతో మూడు కుప్పం ఏరియా హాస్పిటల్ అభివృద్ధి పనులు, రూ.1.52 కోట్లతో 40 ఓ హెచ్ ఎస్ ఆర్ మరమ్మతు పనులు, రూ. 85 కోట్లతో ఏడు మున్సిపాలిటీ అభివృద్ధి పనులు, రూ. 58.08 కోట్లతో 162.58 కి మీ తారు రోడ్ల నిర్మాణం, రూ. 2.89 కోట్లతో 428 కేర్ ఎన్ గ్రో ప్రాథమిక బాల్య అభివృద్ధి కేంద్రాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా కుప్పం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.1282 కోట్ల మేరకు పనులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని వచ్చే ఏడాది పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో 3041 పెన్షన్‌లను అదనంగా అందజేశామని, వెయ్యి మందికి గ్యాస్ కనెక్షన్లు అందించామని, ఈఎస్ఎల్ సంస్థ ద్వారా 400 మందికి ఈ సైకిల్ లు, భారత ప్రభుత్వం మరియు అలింకో సంస్థ ద్వారా 1245 మందికి ట్రై సైకిల్ లు మరియు వీల్ చైర్ లు అందించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా కుప్పం అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలసి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఒక సంవత్సర పరిపాలన కాలం లోనే నియోజకవర్గంలో రూ.1200 కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేశారన్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రాన్ని విధ్వంసం నుండి వికాసం వైపుకు తీసుకెళుతున్నారన్నారు. సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి 2024 వరకు ఒక ఎత్తని, 2024-2029 వరకు జరిగే అభివృద్ధి మరొక ఎత్తని తద్వారా నియోజకవర్గం స్వర్ణ కుప్పంగా మారనుందన్నారు. స్థానికులు బెంగళూరు, మద్రాసు పట్టణాలకు వలసలు వెళ్లకుండా పరిశ్రమలు తీసుకురావడం జరుగుతుందని, 16,000పై చిలుకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఎంఓయూలు చేస్తున్నామన్నారు. 8 పర్యాయాలు నారా చంద్రబాబు నాయుడుని ఏంఎల్‌ఏగా గెలిపించారని వారికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. మీమీ గ్రామాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన మంచిని గురించి అందరికీ తెలియజెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చూస్తున్నదన్నారు. సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా సూపర్ 6 పథకంలో భాగంగా పెన్షన్‌ల మంజూరు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం లాంటి పథకాలను అమలు చేశారన్నారు. అభివృద్ధిపరంగా 80శాతం గ్రామాలలో సిసి రోడ్డులు వేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి వసతి, బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని, ఇంత అభివృద్ధి చేస్తున్నా మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రచారం చేసుకోలేకున్నామని, తద్వారా ఇతరులు ఈ ప్రభుత్వం ఏమి చేయడం లేదని వ్యతిరేక ప్రచారం చేస్తున్నదన్నారు. తాము చేసిన మంచి పనులను చెప్పేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి నేటి నుంచి 30 రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం జరుగుతుందన్నారు. విమర్శ కుల నోరు మూతపడేలా జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతిఒక్కరికీ తెలియజెప్పాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో అదనంగా మంజూరు చేసిన 3041 మందికి చెందిన సామాజిక పెన్షన్ల మెగా చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ సంస్థలకు చెందిన స్టాళ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలించి అక్కడి ప్రతినిధులతో వాటి వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో జెసి జి.విద్యాధరి, కడ పీడీ వికాస్ మర్మత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నూతన గ్యాస్ కనెక్షన్లు అందజేత

విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు, ట్రై సైకిళ్లు పంపిణీ



కొత్తగా 3,041 మందికి పెంఛన్లు అందిస్తూ మెగా చెక్కు అందజేత

మున్సిపల్ కార్పొరేషన్

సచివాలయ కార్యదర్శుల బదిలీల్లో అవకతవకలు

- రాజకీయనేతల సిఫార్సు లేఖకు ప్రాధాన్యత
- మహిళా సంరక్ష కార్యదర్శులు ఇతర జిల్లాకు బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ సచివాలయాల కార్యదర్శిల బదిలీల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ కార్యదర్శులు కోరిన చోట పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంతో సచివాలయ కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీలు గంద రగోళంగా మారాయి. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సెక్రటరీలను మరో ప్రాంతంలోని వార్డుకు బదిలీ చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 102 సచివాలయాల్లో బదిలీలకు అధికారులు పూనుకున్నారు. సీనియారిటీ, ర్యాంకులు ఆధారంగా సచివాలయ సెక్రటరీలను బదిలీ చేయాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం రాజకీయ నేతల సిఫార్సు లేఖలకు, ఇతరుల రికమండేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా బదిలీలను చేయడంపై విమర్శలొస్తున్నాయి. దీనిపై గత రెండు రోజులుగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరుకు కొంతమంది సెక్రటరీలు ఫిర్యాదు చేశారు. బదిలీలు అన్యాయంగా ఉన్నాయని, వెంటనే వాటిని నిలుపుదల చేసి సీనియారిటీ ఆధారంగా బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ బదిలీలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఇప్పటి వరకు పూర్తి చేసిన బదిలీలను మరోసారి పునః సమీక్షించాలని, నిబంధనలు, అర్హతలను పక్కన పెట్టి కొంతమంది అధికారులు చేస్తున్న బదిలీలపై ఆందోళన చేస్తామని సచివాలయ సెక్రటరీలు హెచ్చరిస్తున్నారు.

రాజకీయ నేతల సిఫార్సుకే ప్రాధాన్యత..

పార్టీ నేతల సిఫార్సుకి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. వారికి కావలసిన వారికి అందుబాటులో ఉన్న మంచి సచివాలయానికి పోస్టింగ్లు వేసుకోవడం జరిగింది. అడిషనల్ కమిషనర్ నేతృత్వంలో ఈ బదిలీల ప్రక్రియ జరిగినట్లు తెలుస్తుంది. కూటమి పార్టీ నేతలు వారికి కావలసిన వారిని వారికి కావాల్సిన డివిజన్లో సచివాలయంలో వేసుకోవడం జరిగింది. ర్యాంకుల ఆధారంగా ఎక్కడా పోస్టింగులు ఇవ్వలేదు. అయితే కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు రాజకీయ నేతల పేర్లు చెప్పి డబ్బులు తీసుకొని కూడా బదిలీలు చేసినట్లు నగరపాల సంస్థ కార్యాలయంలో గుసగుసలాడుతున్నారు. ఈ విషయం కమిషనర్ మౌర్య దృష్టికి రాకుండానే బదిలీల జాబితాను సిద్ధం చేసి చిత్తూరులో జరిగిన కౌన్సిలింగ్‌లో పారదర్శకంగా చేసినట్లు అధికారులు చేతులు దులుపుకోవడం జరిగింది. బదిలీల జాబితా చూసి సచివాలయ కార్యదర్శులు ఆందోళనకు గురయ్యారు. జరిగిన అన్యాయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషనర్ వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన చేయాలనుకున్న సచివాలయ కార్యదర్శులు విరమించుకున్నారు.

- మహిళా సంరక్షకుల అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు బదిలీ..
- చిత్తూరు ఎస్పీ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు..

తిరుపతి నగరపాల సంస్థ పరిధిలో 100 మంది మహిళా సంరక్షణ కార్యదర్శులు ఉన్నారు. చిత్తూరుకి కౌన్సిలింగ్ రమ్మని పిలుపునిచ్చారు. తీరా అక్కడ పోయిన తర్వాత వారిని కౌన్సిలింగ్ చేయకుండానే బదిలీ చేసినట్లు నోటీసు బోర్డులో పెట్టారు. ఈ విషయం చిత్తూరు ఎస్పీ దృష్టికి మహిళా సంరక్ష కార్యదర్శులు తీసుకెళ్తే ఆయన వారిపై కఠినంగా వ్యవహరించినట్లు మహిళా సంరక్ష కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 100 మందికిగాను 60 మంది చిత్తూరు అన్నమయ్య జిల్లాలకు బదిలీ చేయడం జరిగింది. మిగిలిన 40 మందిని సత్యవేడు, వరదయ్యపాలెం, బియన్ కండ్రిగ వంటి ప్రాంతాలకు బదిలీ చేశారని కమిషనర్ మౌర్య దృష్టికి తీసుకువచ్చారు. అనారోగ్యంగా ఉన్న వారికి కూడా దగ్గర ప్రాంతాల్లో బదిలీ చేయలేదని దూర ప్రాంతాల్లో చేశారని మహిళా సంరక్ష కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగానే బదిలీలు.. కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలో వార్డు అమ్యూనిటీస్, సచివాలయ కార్యదర్శులు బదిలీలు పారదర్శకంగానే నిర్వహించామని ఎక్కడా గందరగోళం లేదని కమిషనర్ ప్రజాశక్తికి వివరించారు. రాజకీయ నేతల సిఫార్సులు కూడా అంతగా తీసుకోలేదని వివరించారు. ర్యాంకుల ఆధారంగానే బదిలీలు జరిగాయని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల విషయంలో కొందరి నేతల జిల్లాలకు వేయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారని తిరుపతి అర్బన్ ఎస్పీతో మాట్లాడి చిత్తూర్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు.

వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

నగర పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులను గుర్తించి, నగర పాలక సంస్థ తరపున గుర్తింపు కార్డులు త్వరలో అందిస్తామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వీధి విక్రయదారులను గుర్తించడం, నిబంధనలపై వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్.పిలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి విక్రయదారులపై జరుగుతున్న సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ సర్వే రెండు మూడు రోజుల లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా సర్వేలో నమోదు కాని వీధి విక్రయదారులను సంబంధిత వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ, ఆర్.పిలతో నమోదు చేయించాలన్నారు. గుర్తింపు కార్డులు పొందేందుకు 200 రూపాయలు ఇండియన్ బ్యాంకు, టౌన్ వెండింగ్ కమిటీ, తిరుపతి అకౌంట్ (ఎస్‌బి అకౌంట్-8074122243)కు జమ చేయాలని తెలిపారు. అనంతరం వెండింగ్ జోన్స్ ను ఏర్పాటు చేసి, కొన్ని గ్రీన్ జోన్స్ (ఫ్రీ వెండింగ్ జోన్స్), అంబర్ జోన్స్ (రిస్ట్రిక్టెడ్ వెండింగ్ జోన్స్) మరియు రెడ్ జోన్స్ (నో వెండింగ్ జోన్స్) ఏర్పాటు చేస్తామన్నారు. గ్రీన్ జోన్‌లో పూర్తిగా వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇస్తారని, అంబర్ జోన్‌లో నిర్ణీత సమయంలో మాత్రమే వ్యాపారం చేసుకోవచ్చునని, రెడ్ జోన్‌లో పూర్తిగా వ్యాపారం చేసుకోరాదని తెలిపారు. నగరపాలక సంస్థ గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే వ్యాపారానికి అనుమతిస్తారని తెలిపారు. గుర్తింపు పొందిన వీధి విక్రయదారుల నుండి ఎటువంటి రుసుము ఎవ్వరికీ చెల్లించనవసరము లేదని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ మంజూరు చేసిన గుర్తింపు కార్డు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, మరి ఏ ఇతర ప్రైవేటు వ్యక్తులు మంజూరు చేసిన ఐ.డి కార్డులు చెల్లవని కూడా తెలిపారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా సి.యం.యంలు కృష్ణవేణి, సోమ కుమార్, సిఓలు, స్ట్రీట్ వెండార్స్ యూనియన్ నాయకులు శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య



చెవిలో పువ్వు, పంగనామాలతో

స్విమ్స్ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన

గోవింద నామ స్మరణ చేస్తూ చెవిలో పువ్వు పెట్టుకుని అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న స్విమ్స్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సిమ్స్ కార్మికులు చేపట్టిన పోరాటం బుధవారం ఏడవ రోజు చేరుకుంది. 'ఏడుకొండలవాడా వెంకటరమణా మా మొరను ఆలకించు' అంటూ కార్మికులు గోవింద నామ స్మరణ చేస్తూ చెవిలో పువ్వు పెట్టుకుని, పంగనామాలతో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పద్మావతి హాస్పిటల్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వద్ద దీక్షా శిబిరం వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవ్, హాకర్స్ యూనియన్ కార్యదర్శి పి బుజ్జిలు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కార్మికులకు తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, వాటిపట్ల యాజమాన్యం అప్పటినుంచి పట్టించుకోకుండా నిమ్మకు నెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఈ సమస్యలపై పరిష్కారం చేయాలని పదేపదే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. చర్చలు విఫలమవడంతో ఒకటవ తేదీ నుంచి ప్రతిరోజు గంటపాటు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నామన్నారు. పూర్తిగా పనులు ఆపేసి సమ్మెలోకి వెళితే రోగులు ఇబ్బంది పడతారని, ఆ నష్టానికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏడు రోజులు పూర్తికావస్తున్నా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. తక్షణం టీటీడీ ఈవో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి కార్మికులతో, సిఐటియు నేతలతో చర్చలు జరిపి వెంటనే పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్మికులు జి.రవి, వి.సూరి, మారి ముత్తు, బి.వెంకటేష్, కోటయ్య, గోపి, భాష, రాజశేఖర్, రజినీకాంత్, పి వెంకటేష్, కుమారి, జయమ్మ, మునికృష్ణ, మునీంద్ర, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సేవలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు : టీటీడీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీవారి భక్తులకు సేవలు అందించే కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనలకు దిగితే చర్యలు తప్పవని టిటిడి పేర్కొంది. కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలను సదరు శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని టీటీడీ ఒక ప్రకటనలో కోరింది. న్యాయమైన కోర్కెలను తీర్చడానికి యాజమాన్యం సదా సంసిద్ధంగా ఉందని పేర్కొంది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర శాఖలలో సంబంధిత కాంట్రాక్ట్ ఉద్యోగులు విశేషంగా సేవలు అందిస్తున్నారని, భక్తులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు తీసుకోవద్దని కోరింది. భక్తుల సేవలకు ఉద్యోగులు ఆటంకం కలిగించే చర్యలను నిషేధించే ముఖ్యమైన సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) టిటిడిలో అమలులో ఉందని, సదరు నిబంధనలను ఉద్యోగులు గుర్తు చేసుకోవాలని టిటిడి పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఆధ్యాత్మిక సంస్థలో విధులను బహిష్కరించడం సరికాదని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించి సమ్మె బాట పడితే ఎస్మా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఎస్.ఎల్.ఎస్. ఎం.పీ.సీ సంస్థతోపాటు కాంట్రాక్ట్, పలు సొసైటీలలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, సదరు ఉద్యోగులు విధులను బహిష్కరిస్తే ఎస్మా చట్టం ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గతంలో టిటిడిలో విధులను బహిష్కరణ చేసినా మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగింది. ఈసారి విధుల నుండి తొలగించాక విధులను బహిష్కరించిన వారిని ఎలాంటి పరిస్థితుల్లో తిరిగి చేర్చుకోరని టిటిడి తెలిపింది. టిటిడిలో భక్తులకు సేవలు అందించే ఉద్యోగులు ధర్నాలు చేయడం, నిరసన నోటీసులు ఇవ్వడం, ఊరేగింపులు చేయడం చట్టప్రకారం నిషేధం. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా, ఉద్యోగుల విధులకు టిటిడితో సంబంధం లేని బయట వ్యక్తులు ఆటంకం కల్గిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలకు వెనుకాడమని హెచ్చరించింది.

రోగుల వైద్య సేవలను బహిష్కరిస్తే చర్యలు తప్పవు : స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

స్విమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస కార్పోరేషన్‌లోని కాంట్రాక్ట్ ఉద్యోగులు గత కొంత కాలంగా పలు రకాల కోరికలను కోరుతూ విధులను బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని, టిటిడి యాజమాన్యం చాలా సామరస్యంగా పరిష్కరించాలని ఉందన్నారు. సదరు ఉద్యోగులు సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. స్విమ్స్‌లో ఎస్మా చట్టం అమలులో ఉన్నందున సమ్మె నోటీస్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. వైద్య సేవలకు ఆటంకం కలిగిస్తే విధుల నుండి తొలగించే నిబంధన ఉందని, తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. విధులను బహిష్కరించి సమ్మెకు దిగితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్విమ్స్‌తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో నిరసనలకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విధులను బహిష్కరించినందుకుగాను, ఒకసారి ఉద్యోగం తొలగించాక, సదరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోరనే విషయాన్ని గమనించాలని స్విమ్స్ డైరెక్టర్ ఉద్యోగులను కోరారు.

స్విమ్స్ కార్మికుల పట్ల టీటీడీ యాజమాన్యం ద్రోహపూరిత వైఖరి

మూడు దశాబ్దాలుగా స్విమ్స్ ఆసుపత్రిని నమ్ముకొని పనిచేస్తున్న పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికుల పట్ల టిటిడి, స్విమ్స్ యాజమాన్యాలు ద్రోహపూరిత వైఖరితో వ్యవహరించటం దారుణమని స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే. వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి యాజమాన్యం చేసిన తప్పును సరిదిద్దుకుని కార్మికులకు న్యాయం చేయకుండా, ఎప్పటికప్పుడు సరి చేస్తామని చెబుతూ, రాతపూర్వక ఒప్పందాలు చేసుకొని, వాటిని అమలు చేయమని కోరిన పాపానికి కార్మికులకు వారికి మద్దతు ప్రకటించిన వారికి దురుద్దేశాలను ఆపాదించడం అన్యాయమన్నారు. భక్తులకు, రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగరాదన్న ఉద్దేశంతో రెండు సంవత్సరాల నుంచి సంయమనం పాటిస్తున్న పేదలు, దళితులైన కార్మికుల పట్ల వారు చేస్తున్న పోరాటం పట్ల తేలిక భావంతో చేసిన ప్రకటనను తీవ్రంగా వేణుగోపాల్ ఖండించారు. పేదలు ఐక్యంగా చేస్తున్న పోరాటాలను బెదిరించటం, కేసులు పెడతామని, ఉద్యోగాలు తొలగిస్తామని ప్రకటన చేయటం ఏ రకమైన ధర్మం అని ప్రశ్నించారు. ధర్మాన్ని రక్షించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రచారం చేసే ధార్మిక సంస్థకు అధినేతలుగా ఉండి... అధర్మ నియంతృత్వాన్ని ప్రకటించటం అత్యంత అమానుషమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణం టిటిడి స్విమ్స్ యాజమాన్యాలు జోక్యం చేసుకొని పేదల పట్ల నిరంకుశ వైఖరిని విడనాడి వారి న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

గంజాయి వేటకు డ్రోన్

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు గంజాయి తాగే వారిపై ఉక్కు పాదం మోపాలనే సంకల్పంతో బుధవారం రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో తారకరామా నగర్, కరకంబాడి గ్రామాల్లో డ్రోన్ సహాయంతో గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై నిఘా ఉంచుతామని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జయచంద్ర, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ రెడ్డి, తిరుపతి స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరులోని అన్న క్యాంటీన్‌ను బుధవారం పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడారు. నిర్వాహకులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. శుభ్రత పాటిస్తూ, శుద్ధి చేసిన తాగు నీటిని అందించాలని ఆదేశించారు.

అధిక ఫీజులు వసూలుపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతిలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐఓ రాజశేఖర్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్వూరు నారాయణ గౌడ్ బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బైక్ రైడర్లు నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: విచ్చలవిడి విధానాలు అవలంభిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, భరించలేని శబ్దాలు చేసుకుంటూ బజార్ల మధ్య, పట్టణ వీధుల్లో ఇష్టానుసారం బైకులపై తిరుగుతున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ బాబీ తెలిపారు. తిరుపతి జిల్లా, నాయుడుపేట అర్బన్ సిఐ బాబీ బుధవారం మాట్లాడుతూ బైక్‌పై యువకులు విన్యాసాలు చేస్తూ చిన్నారులు, మహిళలను ఇబ్బంది పెడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అతివేగం ఎక్కువ చేసే అక్రమ బైక్ రైడింగ్ లు, నిషేధిత సౌండ్ హారన్ వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలు ధిక్కరిస్తే వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ఎస్వీయూలో కొనసాగుతున్న అకడమిక్ కన్సల్టెంట్ల ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - క్యాంపస్: 2024-25 విద్యా సంవత్సరంలో అకడమిక్ కన్సల్టెంట్స్/కోఆర్డినేటర్ల పనితీరుపై సమీక్ష కమిటీ సమావేశాలు, ఇంటర్వ్యూలు 2 వ రోజు బుధవారం కొనసాగుతున్నాయి. ఈ సమీక్షలు 1 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకు జరుగుతాయి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఈ సమీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. జువాలజీ, అనిమల్ బయోటెక్నాలజీ, కామర్స్, ఫార్మసీ కళాశాల అభ్యర్థులకు జరగాల్సిన స్థానంలో న్యాయ కళాశాల అభ్యర్థులకు ఈరోజు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ముక్కంటి ఆలయానికి విరాళాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేకంగా నిర్వహించే శనీశ్వర స్వామి తైలాభిషేకానికి ఉపయోగించు వర్ద ఉన్న విష్ణు కెమికల్స్ పరిశ్రమ ఎండీ చెరుకూరి కృష్ణమూర్తి దంపతులు లక్షా 9 వేల 500 రూపాయలను బుధవారం విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈఓ బాపిరెడ్డికి అందజేశారు. హైదరాబాద్, బీరంగూడకు చెందిన పెద్దిశెట్టి శంకర్ ప్రసాద్ కుటుంబం బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.5558 విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు.

మల్లం చెరువును కాపాడండి

ప్రజాశక్తి - చిట్టమూరు: మల్లం చెరువును ఆక్రమణదారుల నుండి కాపాడాలని మల్లం గ్రామస్తులు బుధవారం తహశీల్దార్ కాయల సతీష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మల్లం చెరువుకు పులి కాలువ ద్వారా నీరు వెళతాయని చెరువు నీరు పంట పొలాలకు కాలువ ద్వారా వస్తాయని తెలిపారు. ఆ కాలువను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేసి కాలువ పూడికను తీయగా, అదే గ్రామానికి చెందిన కుంచం కోటయ్య దౌర్జన్యంగా జెసిబితో పూడ్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దానితో కలిపి చెరువు భూమిని సేద్యం చేయడం చేస్తున్నారని వాపోయారు. స్పందించిన తహశీల్దార్ సర్వే చేయించి కోటయ్య పొలాన్ని అనుకుని ఉన్న చెరువు భూమి హద్దులు చూపిస్తానన్నారు.

చెవిరెడ్డి అరెస్ట్ అక్రమం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ భాకరాపేట గాంధీ విగ్రహం ముందు వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. నల్ల జెండాలు చేతబట్టుకుని పార్టీ నేతలు, కార్యకర్తలు, చెవిరెడ్డి అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. కడిగిన ముత్యంలా చెవిరెడ్డి బయటకు తీసుకువస్తామన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం వద్దు, అంబేద్కర్ రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల వైసిపి పార్టీ అధ్యక్షుడు సింహాద్రి మోహన్, మాజీ డి.సి.ఎం.ఎస్ చైర్మన్ సహదేవ రెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి, వైఎస్సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకి రూ.6 కోట్లు ఆదాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో జూన్ నెలకు సంబంధించి రూ.6.10 కోట్ల రికార్డు ఆదాయాన్ని నమోదు చేసింది. రోజుకు రూ.20 లక్షలు చొప్పున గరిష్ట కలెక్షన్లు సాధించింది. ఇది శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో చరిత్రలో రికార్డు కలెక్షన్లు, ఆదాయంగా నమోదు కాబడింది. అంతేకాకుండా జూన్ నెలకు సంబంధించి గరిష్ట ఆదాయం పొందిన ఆర్టీసీ డిపోగా తిరుపతి జిల్లాలో ప్రథమ స్థానం పొందింది. ఇది శ్రీకాళహస్తి ఆర్టీసీ సిబ్బంది సమిష్టి కృషి అని డిపో మేనేజర్ ముదిరంద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ జూన్ మాసంలో శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల పుణ్యక్షేత్రాలకు విచ్చేసే భక్తులు లక్ష్యంగా ప్రత్యేక బస్సులను నడిపామని, ప్రయాణికులకు మెరుగైన బస్సు సర్వీసులను నడపడంతో ఈ తరహా ఆదాయాన్ని ఆర్జించినట్లు మేనేజర్ తెలిపారు.

డిస్కమ్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం తిరుపతి టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. విన్న కోటి చంద్ర శేఖర్ రావ్ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేఫ్టీ బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా ఉందో లేదో పరీక్షించాలని ఎలక్ట్రిక్ వైర్లను, పరికరాలను తాకరాదన్నారు. పంట పొలాల్లో ఎలక్ట్రిక్ బోర్లు, పంపు సెట్లు వద్ద పిల్లలు ఆడనివ్వరాదన్నారు. ఎలక్ట్రిక్ వైర్లు, స్తంభాలు పడిపోతే తాకకుండా, స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ డివిజన్ ఉద్యోగులు ఈ ఈ తో పాటు విద్యుత్ ఏడీలు ముని ప్రసాద్, రమేష్, ఏ.ఈ.లు కేశవులు, వెంకట రమణ విద్యుత్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపిస్తా

- సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలంలో టిడ్కో ఇళ్లు
- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని

సిసి రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీని రానున్న రోజుల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తానని, ఇక్కడి పేదలకు తిరుమల నగర్ పంచాయతీలో ఉన్న సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి వారి సొంత ఇంటి కలను నిజం చేస్తామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మంగళం తిరుమల నగర్ గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటింటికి వెళ్లి కూటమిపాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం లేక ఉన్న తుడాలోని లేఔట్ లో నూతనంగా ఎన్ఆర్ జీఎస్ నిధులు 27 లక్షలతో నిర్మించిన నూతన రోడ్డును తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఏడాది కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలో రూ.650 కోట్ల రూపాయల విలువ గల అభివృద్ధి పనులను చేశామన్నారు. ఇంకను మంగళం ప్రాంత ప్రజలకు తెలుగంగ నీటిని అందించాలన్న హామీ అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయించుకుని మంగళం ప్రాంత ప్రజలకు తెలుగుగంగ నీటిని అందించనున్నామన్నారు. మంగళం ప్రాంత ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, తిరుమల నగర్ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గోవింద రాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ టిడిపి అధ్యక్షులు ఈశ్వరయ్య, మంగళం, సప్తగిరి కాలనీ, రణధీరపురం, న్యూ మంగళం పంచాయతీలకు సంబంధించిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ నాయకులుపాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వారాహి దేవికి సారె

సారె తీసుకెళుతున్న మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి దంపతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీ శక్తి పీఠంలో శ్రీ వారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలలో బుధవారం శ్రీ లఘు వారాహి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వారాహి దేవి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతీ స్వామిలు ఆధ్వర్యంలో అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. రాయల చెరువు పేటకు చెందిన మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఊరేగింపుగా సారె, పొంగళ్లను తీసుకొచ్చి పీఠాధియేశ్వరి రమ్యానంద భారతి స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహకులు శ్రీకాంత్, ప్రసాద్, సుధారాణి భక్తులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులపై అభిప్రాయాలు తెలపండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్.: ప్రభుత్వానికి, పంచాయతీలకు ఆదాయం వచ్చే క్వారీలను ఆదరించాలని తిరుపతి జిల్లా ఆర్డీవో రామ్మోహన్ రావు సూచించారు. బుధవారం తడుకు పంచాయతీ సచివాలయం ఆవరణలో జరిగిన పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తడుకు సర్పంచి బొబ్బిలి వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడుకు పంచాయతీలో సర్వే నెంబరు 182, 600 హెక్టార్లు భూమిలో రాళ్లు రప్పలు బిల్డర్ పరికరాలను ఉపయోగపడే ముడి సరుకులు లభిస్తుందని ఇందులోనే మైన్స్ అనుమతులు తీసుకున్నారని, దీనిపై మీ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఎస్సీ ఎస్టీ జిల్లా కార్యదర్శి నందయ్య, గూళూరు కరుణలు పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. మైనింగ్ అనుమతులు తీసుకున్న వారు తమ పనులు నిర్వహించే సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మధుసూదన్ మైనింగ్, అలాగే కనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్, అధికారులు. తణుకు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -వెంకటగిరి టౌన్ : బుధవారం యుటిఎఫ్ ఆఫీసు వద్ద వెంకటగిరి మండల సిఐటియు విస్తృతస్థాయి సమావేశం ఏ మంజుల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ మనదేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. కార్మిక వర్గానికి నష్టం చేసే ఈ లేబర్ కోడ్స్‌ని వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్కీమ్‌లలో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 9న జరుగు సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, అంగన్వాడి, ఆశ, ఆటో, టైలర్స్, హమాలి, మున్సిపాలిటీ, వీధి విక్రయదారులు, ఆర్టీసీ ఔట్సోర్సింగ్ తదితర యూనియన్ల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తిరుపతి విద్యాశాఖాధి కెవియస్ కుమార్ సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా విద్యాశాఖాధికారి చాంబర్‌లో బుధవారం జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల పక్రియపై అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల యాజమాన్య ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసువులు చేయాలని, లేని పక్షంలో వారిని ఇనాక్టివ్ చేయాలని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా వుండాలన్నారు. అడ్మిషన్ల సమయం పెంచాలని అధ్యయన కర్తలు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. రాష్ట్ర ఓపెన్ స్కూల్స్ సొసైటీ సమన్వయ కర్త నరసింహారావు మాట్లాడుతూ అధ్యయన కేంద్రాల సమన్వకర్తల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి, తిరుపతి జిల్లా లోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ పాలక మండలికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ పాలకమండలికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీలో ఎస్‌సి, ఎస్‌టీ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దీనికి ప్రధాన కారణం పాలకమండలి చైర్మన్, సభ్యులకు రాజ్యాంగంపై అవగాహన లేకపోవడమేనన్నారు. తిరుపతి "శ్వేత భవన్"లో టిటిడి ఉద్యోగులకు అవగాహన కల్పించడానికి ట్రైనింగ్ ఇస్తున్నట్లుగా, పాలక మండలికి న్యాయ నిపుణుల చేత రాజ్యాంగంపై అవగాహన కల్పించుటకు రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. టీటీడీ రాజ్యాంగ పరిధిలోకి వచ్చి 90 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సూచించినప్పటికీ టీటీడీ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందన్నారు. స్విమ్స్ వార్డ్ బాయ్స్ చేస్తున్న వారికి సోపులు, కాళ్ళకు చెప్పులు, చేతులకు బ్లౌజులు కూడా టీటీడీ అందించడం లేదన్నారు. శ్రీవారి మెట్టు మార్గాన 30 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నవారిని, పులులు సంచరిస్తున్నాయనే సాకుతో ఖాళీ చేయించడం జరిగిందన్నారు. టీటీడీ యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల విలీనంపై ఆందోళన

యంపిడీఓ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - తడ: తడ మండలం, యంపిడీఓ కార్యాలయం వద్ద తడ కండ్రిగ హరిజనవాడ, అక్కంపేట హరిజనవాడకు చెందిన తల్లులు సిఐటీయు, సీపియం జిల్లా కార్యదర్శి నాగరాజు ఆద్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను మండల యంపిడీఓ శేఖర్ నాయక్, యంఈఓ మల్లిఖార్జునరావులకు వివరించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులు అక్కంపేట హరిజనవాడకు సంబంధించి పిల్లలు యంపీపీయస్ అక్కంపేట ఈస్ట్ నుండి యంపిపియస్ అక్కంపేట మెయిన్ పాఠశాలకు మార్చడంతో పిల్లలు నేషనల్ హైవే దాటి అవతలి వైపు వెళ్లవలసి వుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తడ హరిజనవాడకు సంబంధించి పాఠశాలకు వెళ్ళే మార్గంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కారణాల వల్ల మా పాఠశాలలను విలీనం చేయవద్దని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విలీనం తప్పు పద్ధతిలో జరుగుతోందని, గ్రామస్తులు విలీనానికి ఒప్పుకోవడం లేదని పాఠశాలలు మా గ్రామంలోనే వుండాలని యంపిడీ ఓ కార్యాలయం వద్ద కూర్చుని నిరసన తెలుపుతూ మాకు అధికారుల నుండి సరైన రిపోర్ట్ అందితే తప్ప ఇక్కడ నుండి కదిలేది లేదని తెలిపారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, మండల కార్యదర్శి లక్ష్మయ్య, పార్టీ కన్వీనర్ అల్లేయ్య,ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటరమణ, ఆటో యూనియన్ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ ఆందోళన చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో గురువారం నేషనల్ హైవే మీద ఆందోళన చేపడతామని పిల్లల తల్లులు, నాయకులు తెలిపారు.

మురుగు నీటి కాలువల్లో చెత్త వెయ్యరాదు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలోని మురుగునీటి కాలువల్లో చెత్త వేయొద్దని, ఇంటి వద్దకు మున్సిపాలిటీ సిబ్బందికి అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నగరంలోని 2, 3 వ వార్డులో ప్రజల నుండి వచ్చిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి కమిషనర్ పరిశీలించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త ఉండటాన్ని చూసి కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని మురుగునీటి కాలువలో ప్రజలు చెత్త వేస్తున్నారని దీంతో దాన్ని తొలగించేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. డ్రైనేజీ కాలువల మరమ్మతులు చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తెలుగు గంగ నీటి పైప్ మరమ్మత్తులు చేసి నీరు వృథా కాకుండా చూడాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, డి.ఈ.లు లలిత, శిల్పా, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ నాయకులు కోడూరు బాల సుబ్రమణ్యం, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, స్థానికులు కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.

కార్మిక చట్టాల కోడ్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం (పాకాల) కార్మికులకు వ్యతిరేకంగా అమలు చేయనున్న లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావులు డిమాండ్ చేశారు. బుధవారం పాకాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పనిగంటలు 8 నుంచి 12 గంటలకు పెంచడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 9న నిర్వహించే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆనందు, రాజు, శేఖర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన పెయింటర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈనెల 27వ తేదీన భవాని నగర్ సర్కిల్‌లో నాలుగు అంతస్తుల భవనంపై పెయింటింగ్ చేస్తూ ప్రమాద వశాత్తు జారిపడి మరణించిన రామ్మూర్తి కుటుంబానికి బిల్డింగ్ ఓనర్, మేస్త్రి రెండు లక్షల ఇరవై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షులు మునిరాజా, తిరుపతి పట్టణ నగర్ కార్యదర్శి దాసు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మల్లం రవికుమార్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాడేపల్లి వైసిపి పార్టీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన రాష్ట్ర స్థాయి పార్టీ యువజన విభాగం సమావేశంలో తిరుపతి నుంచి వైసిపి రాష్ట్ర నాయకులు మల్లం రవికుమార్ రెడ్డితో పాటు మరికొందరు యువ నాయకులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అధికార పార్టీకి వినిపించే విధంగా ముందుకు వెళ్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమ పోరాటాలు చేయాలని పార్టీకి యువత, విద్యార్థి విభాగాలే కీలకమని పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని అధినేత మార్గదర్శనం చేశారని మల్లం రవికుమార్ రెడ్డి తెలిపారు.

రూ. 60 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం : ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఏడాది కాలంలో నగరంలో 60 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 33, 9 వ డివిజన్‌ల పరిధిలోని అబ్బన్న కాలనీలో, మారుతీనగర్ పరిధిలో 19.25 లక్షలతో నూతనంగా నిర్మించిన యూజిడి లైన్, సిసి డ్రైన్, సిసి రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు దూది కుమారి, నరసింహాచ్చారి, నరేంద్ర, సికే రేవతి, శైలజ, వరికుంట్ల నారాయణలు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మురుగునీరు తూకివాకం వెళ్ళే అవుట్ పాల్ ఏరియా రేణిగుంట ప్రాంతంలో రోడ్డు మధ్యలో కుంగిపోయిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని కోరామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి సుమారు 20 కోట్లతో డెమానుస్ట్రేషన్ ప్రాజెక్ట్ గా పరిష్కరించేందుకు ఆమోదం తెలిపింది అన్నారు. డ్రైనేజీ కాలువలు, డ్రైన్స్, సిసి రోడ్లు, వీధి లైట్ల సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలలో ట్రాఫిక్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-తిరుమల: తిరుపతి, తిరుమలలో రవాణా శాఖ, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాహన యజమానులకు అపరాధ రుసుమును విధించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తిరుమల జీఎన్ సీ టోల్గేట్ వద్ద తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, వెంకట రమణ నాయక్‌లు 45 వాహనాలను తనిఖీ చేసి 22 వాహనాలు రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతుండడంతో ఆ వాహనాలకు రూ.1,31,220 రూపాయల జరిమానాలను విధించడం జరిగిందన్నారు. నిబంధనలను ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.

గెస్ట్ లెక్చరర్లు కావలెను

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించుటకు అతిథి అధ్యాపకులు (గెస్ట్ ఫ్యాకల్టీ) కావాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, ఇతర వివరాలకు 9966054682 నంబర్లో సంప్రదించవచ్చని తెలియజేశారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - రామచంద్రపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సీఎం చంద్రబాబు ఆదేశానుసారం, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనల మేరకు రావిళ్ళవారిపల్లి పంచాయితీ, బ్రాహ్మణ కాలవ, ఏఏడబ్ల్యు ల్లో కూటమి ప్రభుత్వం ఎడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈతమాకుల ఉమాపతి నాయుడు, ఆర్ గిరి నాయుడు, కే నరసింహారెడ్డి, కోరా హరిప్రసాద్, ఎల్ సురేందర్ నాయుడు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, ముసలిపేడు, బండారుపల్లి గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు ఇంటింట బాట పట్టారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు, ప్రజా సమస్యలు మై టిడిపి యాప్లో నమోదు చేసి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, పేరం ధనంజయ నాయుడు, పత్రిక్ష్ణ వేణి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యస్వీయూ పచ్చదనం కోసం విరాళం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో పచ్చదనం పెంపొందించేందుకు తిరుపతికి చెందిన యూనియన్ బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ ఎం.ఎస్. దామోదరం గుప్త మిత్రుడి జ్ఞాపకార్థం 25 వేల రూపాయల చెక్కును అందజేశారు. స్వర్గస్తుడైన తన మిత్రుడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె. కాశీనాథ్ పిళ్ళై (పత్తికొండ) జ్ఞాపకార్థం, యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, ఆచార్య భూపతి నాయుడులకు ఈ చెక్కును ఆయన అందించారు. విశ్వవిద్యాలయం పచ్చదనాన్ని కాపాడడం కోసం ఈ కొద్ది మొత్తాన్ని ఉపయోగించాలని విశ్వవిద్యాలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

క్రైం న్యూస్

గ్యాస్ లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఓజిలి : గ్యాస్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం ఓజిలి మండలం, పెద్దపరియ జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. గుజరాత్ నుండి చెన్నైకి గ్యాస్‌తో వెళ్తున్న ట్యాంకర్ లారీ పెద్దపరియ జాతీయ రహదారి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదము చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన జాతీయ రహదారి కావడంతో వాహనాలు రాకపోకలు రద్దీగా అధికంగా ఉంటుంది. గ్యాస్‌తో నిండి ఉన్న ట్యాంకర్ లారీ పేలి ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను, ప్రజలను అప్రమత్తం చేశారు.

విష జ్వరంతో బాలిక మృతి

మృతి చెందిన జాస్మిన్

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) చంద్రగిరి పట్టణం సమీపంలోని రాయలపురం పంచాయతీలో విష జ్వరంతో జాస్మిన్ (16) అనే బాలిక మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు జాస్మిన్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది కన్నెత్తి చూడలేదు. బుధవారం జ్వరం అధికమై ఫిట్స్ రావడంతో చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. వైద్యసిబ్బంది కనీసం విష జ్వరాలు అదుపుకు ఎలాంటి మెడికల్ క్యాంపులు నిర్వహించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారుశుద్ధ్య పనులు కూడా చేపట్టకపోవడంతో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్.. 14 లక్షల రూపాయలు స్వాధీనం

సూత్రపు అభిషేక్

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల పేర్లను, అడ్డుపెట్టుకుని కళాకారుల నుండి లక్షల రూపాయలు మోసగించిన వ్యక్తిని తిరుమల వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 14 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా, కాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్ (28) తిరుమలలోని ఆస్థాన మండపం "శ్రీనివాస కళార్చన" పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తానని చెప్పి, హిందూ ధర్మ ప్రచారాపరిషత్ అధికారిక అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళాబృందాలకు చెందిన 2,900 కళాకారులను నమ్మించి మోసం చేసి, వారి వద్ద నుండి మొత్తం 35 లక్షల రూపాయలు వసూలు చేశాడు. కళాకారులకు వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, మెమెంటోలు, శాలువలు వంటి సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చాడు. అయితే, అతనికి టిటిడి అధికారిక అనుమతి లేదని, ఈ మొత్తం ప్రక్రియ మోసపూరిమని తిరుమల ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అనిపై కేసు నమోదు చేశారు. ధర్యాప్తులో భాగంగా తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ఆదేశాలతో ఒన్ టౌన్ సి.ఐ జి. విజయ కుమార్, ఎస్.ఐ రమేష్ బాబు, సిబ్బంది మంగళవారం అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. అతన్ని తిరుపతి కోర్టులో హాజరు పరిచారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రెండు లారీలు ఎదురెదురు డీ కొనగా ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం శ్రీకాళహస్తి మండలం, చెర్లోపల్లి వద్ద మదనపల్లి–నాయుడు పేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. చెర్లోపల్లిపల్లి సమీపంలోని శ్రీకాళహస్తి సర్వీస్ రోడ్డు వద్ద తిరుపతి–నెల్లూరు, నెల్లూరు–తిరుపతి వైపు వెళ్లే లారీలు డీ కొన్నాయి. ఈ సంఘటనలో నెల్లూరు వైపు వెళుతున్న లారీ డ్రైవర్ శోభన్ బాబు(35) లారీలోనే ఇరుక్కుని మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్‌కి సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్థానిక ప్రసూతి వైద్యశాల దగ్గర లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణీల సహాయకులకు 300 మందికి ఉచిత అల్పాహార వితరణ చేశారు. 95 మందికి షుగర్ టెస్ట్‌లు బిపి టెస్టులు చేశారు. డాక్టర్స్ డే వారోత్సవ సందర్భంగా ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ అయిన డాక్టర్ ప్రమీల దేవిని జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ మక్కిన భాస్కర్ ,అధ్యక్షులు బండి మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ చక్రపాణి, కోశాధికారి పురుషోత్తం, ఉపాధ్యక్షులు లైన్ శంకర్, లైన్స్ లియో క్లబ్ అధ్యక్షులు కార్యదర్శి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి 'సిపాయి భరోసా'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సోమయ్య కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం బుధవారం పరామర్శించారు. సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సిపాయి ఆయన కుటుంబాన్ని ఓదార్చి నెలకు సరిపడా సరుకులను అందజేశారు. రత్నం రెడ్డి, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న జగన్ చిత్తూరు జిల్లా పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 9వ తేదీన చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నట్లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసం వద్ద బుధవారం పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9న వైఎస్ జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో పర్యటించి మామిడి రైతులను పరామర్శిస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులు మామిడి కాయలు రోడ్డుపై పడేసే పరిస్థితి వచ్చిందన్నారు. పల్ప్ సిండికేట్ నా పని అంటూ విష ప్రచారం చేస్తున్నారు. అలాంటప్పుడు కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పల్ప్ ఫ్యాక్టరీలు 90 శాతం టీడీపీ వారివి ఉంటే.. టీడీపీ దిన పత్రికలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇదంతా చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు.

IN THE COURT OF THE PRL CIVIL JUDGE (JUNIOR DIVISION) : VENKATAGIRI
O.S. NO.172 / 2021

K, Venkateswarlu ....Plaintiff
Vs
Meriga NandaKumar (died) and others .... Defendants

SUMMONS TO DEFENDANTS NO.2 AND 3

D-2. M. Narayana Priya, W/o M. Nanda Kumar
D-3. M. Theja, S/o Late M. Nanda Kumar
Both are Residing at DoorNo. 2-47 Narasimharao pet, Gudur Town post and Urban Mandal, SPSR Nellore District.

Where as the Plaintiff has instituted a suit against you. You are here by summoned to appear in the court in person or by a pleador duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompained by some other person able to answer all such questions on the date. 26-08-2025 at 10.30 AM in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intended to rely in support of defence. Take summons that in default of your appearnce on the day above mentioned the suit will be heard and determined in your absence.

G. TIRUMALA REDDDI,
ADVOCATE, TIRUPATI.
CELL : 9963918447